క్లుప్తంగా

ఉపాధి పనులు గుర్తించి కూలీలకు పని కల్పించాలి



పర్యవేక్షిస్తున్న సర్పంచ్ సయ్యద్ హైదర్

మల్లాపూర్: ఉపాధిహామీ పథకంలో చేపట్టాల్సిన పనులను గుర్తించి ఉపాధికూలీలకు పని దినాలు కల్పించాలని సర్పంచ్ సయ్యద్ హైదర్ అన్నారు. గురువారం మల్లాపూర్ మండలంలోని హుస్సేన్‌నగర్‌లో ఉపాధిహామీ పనులను పర్యవేక్షించి మాట్లాడారు. గ్రామంలోఉపాధి హామీ పనులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈజీఎస్ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, మెట్‌లు, సిబ్బంది కూలీలు పనులు చేపట్టేటప్పుడు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కూలీలు పనిచేసే స్థలంవద్ద మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ షేక్ సాదుల్లా, వార్డుసభ్యులు, ఫీల్డ్‌అసిస్టెంట్, మెట్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ముగిసిన కంటి వెలుగు



వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్

రాయికల్: మండలంలోని మైతాపూర్ గ్రామంలో గురువారం కంటివెలుగు వైద్యశిబిరం ముగిసింది. ఈ సందర్భంగా కంటివెలుగులో పాల్గొన్న వైద్యులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ అజారొద్దీన్ ఎంపీటీసీ మధు, వైద్యాధికారి నరేంద్ర, కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, సిబ్బంది హేమలత, ప్రశాంత, ప్రతిమ పాల్గొన్నారు.

నియామకం



రాజేశ్ రాజు

రాయికల్: అంబేడ్కర్ సేవాసమితి ఇంటర్నేషనల్ సలహాదారుడిగా రాయికల్‌కు చెందిన మ్యాకల రాజేశ్ రాజును నియమించినట్లు ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రాజు గురువారం నియమక పత్రం అందించారు. రాజేశ్ మాట్లాడుతూ.. ప్రవాసీయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

తండ్రి జ్ఞాపకార్థం వైకుంఠ రథం ఏర్పాటు



ఏర్పాటు చేస్తున్న వైకుంఠ రథం

ధర్మపురి: అంతిమయాత్ర నిర్వహించేందుకు వైకుంఠరథం ఏర్పాటుచేస్తున్నట్లు మండలంలోని జైనా గ్రామానికి చెందిన గుడ్ల విజయ్‌కుమార్ తండ్రి గుడ్ల సత్యనారాయణ, సోదరుడు శ్రీకాంత్ జ్ఞాపకార్థం సుమారు రూ.3 లక్షలతో వైకుంఠరథాన్ని అందించేందుకు అన్నిఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నవారు, నిరుపేదల కోసం వైకుంఠరథం ఉపయోగపడుతుందన్నారు. జైనా గ్రామస్తుల సౌకర్యార్థం ఈ రథాన్ని ఏర్పాటుచేయిస్తున్నట్లు విజయ్ తెలిపారు. ఈ సందర్భంగా వైకుంఠరథం ఏర్పాటుతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

ఊరూరా కాంగ్రెస్ జెండా ఎగురుతుంది



పోతారంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

మల్యాల: మండలంలోని పోతారం గ్రామంలో గురువారం కంటె అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జెండాను చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం ఆవిష్కరించారు. పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సత్యం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో అన్నివర్గాల ప్రజలు మోసపోయారని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు కాంగ్రెస్ సంక్షేమ పథకాలను వివరిస్తూ, సీఎం కేసీఆర్ పాలనలోని ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ, ప్రజలను చైతన్య పరుస్తూ, కాంగ్రెస్‌కు పునర్వైభవం తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. కంటె అరుణ్‌కుమార్, మల్యాల మండలాధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి వెల్మ లక్ష్మారెడ్డి, దారం ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, కంచర్ల లక్ష్మణాచారి, ఎడిపెల్లి రాజిరెడ్డి వీరమల్లు గౌడ్, నర్సింహారెడ్డి, అనిల్, లక్ష్మణ్, అంజి,రాకేశ్ పాల్గొన్నారు.

నెరవేరిన కల

- మినీ స్టేడియం నిర్మాణానికి మోక్షం
- డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ. 11 లక్షలు మంజూరు
- క్రీడాకారుల్లో ఆనందం
- చకచకా కొనసాగుతున్న పనులు



ఇబ్రహీంపట్నంలో కొనసాగుతున్న మినీ స్టేడియం అభివృద్ధి పనులు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం మినీస్టేడియం నిర్మించాలనే ఉద్దేశంతో మండలానికో మినీస్టేడియం నిర్మాణానికి స్థలం కేటాయించింది. కానీ నిధులు లేక మినీస్టేడియం నిర్మాణానికి నోచుకోలేదు. దీంతో మండలంలోని యువకులు ఆడుకునేందుకు స్థలంలేక క్రీడల్లో రాణించలేకపోతున్నారు. దీంతో ప్రభుత్వం మండల శివారులోని ధర్మసాగర్ కాలనీ డబుల్ బెడ్రూం ఇళ్లపక్కన స్థలంలో మినీస్టేడియం నిర్మాణానికి ఐదేకరాల స్థలం రెవెన్యూ అధికారులు కేటాయించారు. కానీ నిధులు లేక స్టేడియం నిర్మాణం చేపట్టలేదు. పలుసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు, గ్రామంలోని యువక్రీడాకారులు స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మినీస్టేడియం నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.11 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో స్టేడియం పనులు చకచకా సాగుతున్నాయి. దీంతో క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఐదేకరాల స్థలంలో యువకులు ఆడుకునేందుకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, జీమ్, స్టేడియం పక్కన చిన్నారుల కోసం చిన్నపార్కును ఏర్పాటు చేయనున్నారు. ఈ స్టేడియం నిర్మాణం పూర్తయితే యువకులు క్రీడల్లో నైపుణ్యం పెంచుకునేందుకు అవకాశం కలగనుంది.

చాలా ఆనందంగా ఉంది



మినీస్టేడియం నిర్మాణానికి ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నాం. ప్రస్తుతం స్టేడియం నిర్మాణానికి పనులు చకచక సాగుతున్నాయి. మరిన్ని నిధులు మంజూరు చేసి పూర్తిస్థాయిలో స్టేడియం నిర్మించాలి. స్టేడియం నిర్మాణంతో క్రీడాకారుల్లో ఆనందం కలుగుతుంది.

– కొడిమ్యాల దీపక్‌రాజ్, ఇబ్రహీంపట్నం

కల నెరవేరింది



యువకులు క్రీడల్లో రాణించేందుకు స్టేడియం లేక చాలా ఇబ్బందులు పడ్డారు. ఈ విషయంలో ఎలాగైనా స్టేడియం నిర్మించాలనే పట్టుదల ఉండేది. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ప్రోత్సాహంతో మినీస్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరుతో కల నెరవేరింది. నిధులు మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యేకు ధన్యావాదాలు.

– నేమూరి లత, సర్పంచ్, ఇబ్రహీంపట్నం

పనులు చేపడుతున్నాం



మినీస్టేడియం నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ నిధులు రూ.11లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో మినీస్టేడియంలో పనులు చేయిస్తున్నాం. మరిన్ని నిధులు రాగానే పూర్తిస్థాయిలో పనులు చేపడతాం. మరో 15 రోజుల్లో పనులు పూర్తిచేసి అందుబాటులోకి తెస్తాం.

– నిరంజన్ రెడ్డి, పీఆర్‌ఏఈ

శరవేగంగా జగిత్యాల అభివృద్ధి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ
- క్రీడలకు పెద్దపీట
- సమ్మర్ క్యాంప్ వినియోగించుకోవాలి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ

జగిత్యాల: రాష్ట్ర ఏర్పాటు తర్వాత జగిత్యాల శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, సీఎం కేసీఆర్ జగిత్యాల అభివృద్ధికి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ అన్నారు. గురువారం పట్టణంలోని 20వ వార్డులో రూ.15 లక్షలు, అంగడి బజార్‌లో రూ.30 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. జగిత్యాలలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి జరుగుతోందని, 100 మీటర్ల వెడల్పు యావర్‌రోడ్డు చేసి డ్రైయినేజీ నిర్మాణం చేపట్టామన్నారు. రూ.2 కోట్ల ఎస్‌ఎఫ్‌టీపీ నిర్మాణంతో మానవ వ్యర్థాలు బహిరంగంగా వేయకుండా ఎరువులు మార్చే యూనిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. 20 ఎకరాల్లో డంపింగ్ యార్డు, రూ.40 కోట్లతో మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు, టౌన్‌హాల్ ఆధునీకరణ, ఓపెన్ జిమ్‌లు, పార్కుల అభివృద్ధి, వీధివ్యాపారులకు షెడ్లు ఎన్నో అభివృద్ధి చేసుకున్నామన్నారు. ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ.. అన్ని సంఘం భవనాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ నిధులు మజూరు చేస్తున్నారని, పద్మశాలీ సేవ సంఘానికి సైతం నిధులు కేటాయించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు అనుమండ్ల కృష్ణహరి, అడువాల జ్యోతి, నవీన్, నరేశ్ పాల్గొన్నారు.

క్రీడలకు పెద్దపీట

క్రీడలకు పెద్దపీట వేస్తున్నామని యువత కోసం ఏర్పాటు చేసిన బాస్కెట్‌బాల్ స్పెషల్ క్యాంప్ ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. గురువారం శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తున్నామని క్రీడాకారుల కోసం ఒక జిమ్ రూ.14 లక్షల వ్యయంతో నలువైపులా ఏర్పాటు చేశామన్నారు.

భవన నిర్మాణాలు వేగవంతం చేయాలి

భవన నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ఓల్డ్ హైస్కూల్‌లో మనబస్తీ మన బడి పథకంలో మంజూరైన రూ.1.80 కోట్లతో నిర్మిస్తున్న అభివృద్ధి పనులను పరిశీలించి మాట్లాడారు. మన బస్తీ మన బడి పథకంతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌స్థాయిలో రూపుదిద్దుకుంటున్నాయన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు...

ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయడంతో గురువారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఉద్యోగాలను పర్మినెంట్ చేసి తమ కుటుంబాలను ఆదుకున్నారన్నారు కార్యక్రమంలో కౌన్సిలర్ నవీన్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యుడు టీవీ.సూర్యం, మోర సుజాత, అమిత్, సుధాకర్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు నవీన్, రాజు, కమిషనర్ నరేశ్, డీఈ రాజేశ్వర్, విజేందర్‌రావు, స్వప్న, మాధవి, రాజేశ్వరి, శ్రీలత పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న వెంకటేశ్

మల్లాపూర్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మల్లాపూర్ మండలంలోని ఒబులాపూర్, గొర్రెపల్లి, వేంపల్లి గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ (సెర్ప్) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. కేంద్రాల్లో 'ఏ' గ్రేడ్‌కు రూ.2,080,సాధారణ రకానికి రూ.2,060 మద్దతు ధర అందిస్తున్నట్లు తెలిపారు. కేంద్రాల్లో రైతులకు మౌలిక వసతులు సమకూర్చాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రాజేశ్, సీసీలు లక్ష్మీరాజం, రమేశ్, రాజు, స్రవంతి, సీఏ సరిత, సర్పంచ్ అలిశెట్టి రవి, బిట్ల సరోజన, కొంపెల్లి సరోజన, ఎంపీటీసీలు తోట సుజాత, గుగ్లావత్ భూమి, నాయకులు కాటిపెల్లి ఆదిరెడ్డి, బిట్ల నరేశ్, కదుర్క నర్సయ్య, తోట శ్రీనివాస్, గుగ్లావత్ రాజేందర్, తోట రాజరెడ్డి, ఎర్ర రమేశ్ పాల్గొన్నారు.

కొనుగోళ్లు సకాలంలో పూర్తి చేయాలి

వెల్గటూర్: ధాన్యం కొనుగోళ్లు సకాలంలో పూర్తిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వెల్గటూర్ మార్కెట్‌కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్ అన్నారు. గురువారం ఎండపల్లి మండలం అంబారిపేటలోని డీసీఎంఎస్ సెంటర్‌ను సందర్శించారు. కొనుగోళ్లు త్వరగా పూర్తిచేయాలని నిర్వాహకులను ఆదేశించారు. మిల్లర్లు త్వరగా దిగుమతి చేసుకోవడం లేదని నిర్వాహకులు తెలపగా కొనుగోలు కేంద్రం నుంచి వచ్చిన లారీలను త్వరగా దిగుమతి చేసుకుని రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మిల్లర్లను కోరారు. సర్పంచ్ దుర్గం లక్ష్మి, ఎంపీటీసీ జాడి సుజాత, రైతులు పాల్గొన్నారు.

తేమశాతం చూసుకుని తీసుకురావాలి

ధర్మపురి: రైతులు పండించిన ధాన్యంలో 17 శాతం తేమశాతం చూసుకుని కేంద్రానికి తీసుకురావాలని ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని నేరెల్ల గ్రామంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, సర్పంచ్ పలిగిరి వసుంధర, ఎంపీటీసీ రెడ్డవేని సత్యం, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు భీమన్న పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు శేర్ల రాజేశం, నాయకులు కాసారపు రాజాగౌడ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఏఈవో అక్షయ్‌కుమార్ తదితరులున్నారు.

7వ రోజుకు చేరిన సమ్మె

రాయికల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె గురువారం 7వ రోజుకు చేరింది. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జేపీఎస్‌లు చేస్తున్న సమ్మెకు సర్పంచులు, కారోబార్‌లు సంఘీభావం తెలిపారు.

సీఎంవోకు ట్విట్టర్ ద్వారా వినతి

ఇబ్రహీంపట్నం: మండల పరిషత్ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ డిమాండ్లను పరిష్కరించాలని చేస్తున్న సమ్మెలో భాగంగా 7వ రోజు తెలంగాణ సీఎంవో ట్విట్టర్ ఖాతాకు తమ సెల్‌ఫోన్‌ల ద్వారా ట్వీట్‌చేసి నిరసన తెలిపారు.



సీఎంవోకు ట్విట్టర్ సందేశం పంపుతున్న కార్యదర్శులు

ముగ్గుతో నిరసన...

జగిత్యాలరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తేనే సమ్మె విరమిస్తామని కార్యదర్శుల సంఘం జగిత్యాల మండల అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. 7వ రోజు మండల పరిషత్ కార్యాలయం ఎదుట తమ డిమాండ్లను ముగ్గురూపంలో వేసి వినూత్నంగా నిరసన తెలిపారు.

ఒంటికాలిపై..

పెగడపల్లి: తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె ఏడోరోజుకు చేరింది. సమ్మెలో భాగంగా పెగడపల్లిలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు.

మోకాళ్లపై..

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ గురువారం మోకాళ్లపై ప్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేస్తూస్తు సమ్మె కొనసాగించారు. ఉద్యోగ భద్రతతో పాటు, పలు డిమాండ్లను పేర్కొంటు ముగ్గుల రూపంలో పొందుపర్చి మోకాళ్లపై మూడు గంటలు కూర్చుని నిరసన తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఈ సత్యనారాయణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏడీఈ, ఏఈలు

మెట్‌పల్లి/కథలాపూర్/ఇబ్రహీంపట్నం/మల్లాపూర్/సారంగాపూర్: విధి నిర్వాహణలో విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని ఎన్పీడీసీఎల్ సీఈ సత్యనారాయణ, కథలాపూర్ ట్రాన్స్‌కో కన్‌స్ట్రక్షన్ ఏడీఈ రాజబ్రహ్మాచారి, ఇబ్రహీంపట్నం ట్రాన్స్‌కో ఏఈ సతీశ్, మల్లాపూర్ ఏఈ వీనిత్ కుమార్, సారంగాపూర్ ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ అన్నారు. గురువా రం జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో విద్యుత్ భద్రత వారోత్సవాలను ఘనంగా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. విద్యుత్ వినియోగదారులకు, రైతులకు అవగాహన కల్పించారు. విద్యుత్‌ను పొదుపుగా వాడాలని, ఇళ్లు, పొలాల వద్ద విద్యుత్‌కు సంబంధించి ఏ సమస్య తలెత్తినా ట్రాన్స్‌కోకు సమాచారం అందించాలన్నారు. విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు లోపాలను సరిదిద్దాలన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలందించడానికి కృషి చేయాలన్నారు. రైతులు కరెంటు మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు రైతులు, గృహ విద్యుత్ వినియోగదారులు ఐఎస్ఐ మార్కుగల పరికరాలనే వాడాలన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా నృసింహుడి జయంతి ఉత్సవాలు



జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్న అర్చకులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలకేంద్రంలో కొండపై వెలసిన శ్రీలక్ష్మీనృసింహస్వామి జయంతి వేడుకలను ఆలయ అర్చకులు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. అర్చకులు వొద్దిపర్తి చిన్న సంతోష్, వొద్దిపర్తి మధుకుమారాచార్యులు ఘనంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారు ఉద్భవించే స్థంభాన్ని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, ఎంపీపీ మసర్తి రమేశ్, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, మాజీ జెడ్పీటీసీ ముప్పాల జలజ, భక్తులు పాల్గొన్నారు.

మూటపల్లిలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

రాయికల్: మండలంలోని మూటపల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం విగ్రహాల ఊరేగింపు, స్వామివారికి అభిషేకం, హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, సర్పంచ్ బెక్కం తిరుపతి,నాయకులు రాజేశం, రాజిరెడ్డి, రాజం, విష్ణు, అర్చకులు పూర్ణచందర్, శ్రీనివాస్, రమణ పాల్గొన్నారు.

సమస్త దేవతలకు నిలయం గోమాత



స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

జగిత్యాల: సమస్త దేవతలకు నిలయం గోమాత అని అర్చకులు నంబి వేణుగోపాలచార్య కౌశిక అన్నారు. జిల్లాకేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నాలుగోరోజు నిత్యహోమం, నవకలశ స్నపనం, చందనోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర

కథలాపూర్: మండలంలోని దుంపేటలో శుక్రవారం శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ అంబటి లత, కమిటీ సభ్యులు తెలిపారు. జాతర ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

సూపరింటెండెంట్‌ను తొలగించాలి

రాయికల్: రాయికల్ వైద్య విధాన పరిషత్‌లో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రవిని తొలగించి శాశ్వత సూపరింటెండెంట్‌ను నియమించాలని కోరుతూ జిల్లా కో–ఆర్డినేటర్ సుదక్షిణదేవిని కలిసి వినతిపత్రం సమర్పించినట్లు రాయికల్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రవి తెలిపారు.

కోదండరాం అరెస్ట్ అప్రజాస్వామికం

మెట్‌పల్లి: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని చీఫ్ సెక్రటరీని కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు సచివాలయానికి వెళ్తున్న ప్రొఫెసర్ కోదండరాంను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని టీజేఎస్ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై పోరాడుతున్న ప్రతిపక్షాలను అణిచివేసేలా ప్రభుత్వం వ్యవహరించడం సరికాదన్నారు. చిత్తశుద్ధి ఉంటే నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేల చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

గిట్టుబాటు ధర కల్పించేందుకు కేంద్రాలు ఏర్పాటు

మెట్‌పల్లి: రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఎంపీపీ మారుసాయిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చింతలపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందొద్దన్నారు. పీఏసీఎస్ చైర్మన్ లింగారెడ్డి, సర్పంచ్ అర్చన తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బుగ్గారం: సిరికొండ ఫీడర్‌లో ప్రత్యేక మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం బీర్సాని, మద్దునూర్, గోపులాపూర్, బొంకూర్, వెనుగుమట్ల, లొత్తునూర్, సిరికొండ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నేరెళ్ల సెక్షన్ ఏఈ బండారి అశోక్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటవరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

'సాగర కెరటాలు' పుస్తకావిష్కరణ



'సాగర కెరటాలు' పుస్తకావిష్కరణలో పాల్గొన్న నాయకులు, ఉపాధ్యాయులు

కథలాపూర్: మండలకేంద్రానికి చెందిన పులికాంత విద్యాసాగరయ్య రచించిన ' సాగర కెరటాలు' పుస్తకాన్ని ఓ వివాహ వేడుకల్లో గురువారం ప్రజాప్రతినిధులు, నాయకులు ఆవిష్కరించారు. రిటైర్డ్ తెలుగు టీచర్ విద్యాసాగరయ్య సరళమైన భాషలో ఈ పుస్తకాన్ని రచించినట్లు వక్తలు పేర్కొన్నారు. విద్యాసాగరయ్యను పలువురు శాలువాలతో ఘనంగా సన్మానించారు. జంగమ కులసంఘ ం జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్, కార్యదర్శి నీరంజన్, నియోజకవర్గ అధ్యక్షుడు గొంగళ్ల రవి, వీరశైవ రాష్ట్ర ఆగమ సలహాదారు సాంబశివుడు, విజయ్‌కుమార్, భద్రయ్య, డీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి శశిధర్ పాల్గొన్నారు.